

ఓం నమో భగవతే శ్రీరమణాయ

# రమణ భాస్కర



**(జిన్నూరులో శ్రీ నాన్నగారి ప్రవచనము, 16-3-98)**

**ప్రియమైన ఆత్మబంధువుల్లారా,**

సత్యవస్తువు మన హృదయంలో ఉంది. మనకు హృదయంలోనికి వెళ్ళే శక్తి లేక బాహ్యమైన అనుభవాలకోసం చూస్తున్నాము. లోపలఉన్న వస్తువుకు సంబంధించిన అనుభవం పొందాలనేకాంక్ష ఇంకా మనకురావటంలేదు. ఎంతసేపు బాహ్యమైన అనుభవాలకోసం చూస్తున్నాము. వస్తువు లోపల ఉంది. మనకు అనుభవం లోపలే కలగాలి. కాలం ముఖ్యంగాని దేహం గురించి, లోకం గురించి కంగారు పడనక్కరలేదు. లోపలఉన్న సత్యవస్తువుకు తలంపులు లేవు. దేహం నేను అని అనదు. మరినేను నేను అని ఎవరు అంటున్నారు. మన లోపలఉన్న మనస్సే నేను అని అంటోంది. మనలో ఉండి ఏదైతే నేను, నేను అంటోందో దానిని అణచటమే మన సాధనల యొక్క ప్రయోజనం. మీరు ఏ పద్ధతి ప్రకారం సాధన చేస్తూ ఉంటే మీ మనస్సుకు శాంతి కలుగుతోందో, నిర్మలం కలుగుతోందో ఆ పద్ధతి ప్రకారం సాధన చేయాలి. అనుకరణవద్దు, అనుకరణవలన జ్ఞానం రాదు. మనం ఏ రకంగా మాట్లాడితే, దైనందిన జీవితంలో మన ప్రవర్తన ఏరకంగా ఉంటే, ఇతరుల పట్ల అనుబంధం ఏ రకంగా ఉంటే మన మనస్సు అణుగుతుందో చూసుకొని అలా ప్రవర్తించటమే సాధన. ఈ మనస్సు అణగటానికే అభ్యాసము, వైరాగ్యము అవసరము. వైరాగ్యము వలన మనస్సు యొక్క విజృంభణ తగ్గుతుంది. మనస్సుకు బాహ్యమైన విజృంభణ ఎప్పుడైతే తగ్గిందో దాని జన్మస్థలం దగ్గరకు ప్రయాణం మొదలుపెడుతుంది. మనస్సు యొక్క జన్మ స్థలానికి మనస్సును పంపటానికి మనం చేసే ప్రక్రియే అభ్యాసం. మేము సాధన చేస్తున్నాము మనస్సు నిలబటం లేదు అని చెపుతారు. అంటే మీకు వైరాగ్యం లేదు అని అర్థం. ఎవరు ఏమార్గంలో ప్రయాణం చేసినా అభ్యాసము, వైరాగ్యము లేని వాడికి జ్ఞానం కలుగదు అని గీతలో భగవంతుడు చెప్పాడు. ఇతరులు ఎవరైనా మిమ్మల్ని గౌరవిస్తే మీకు నష్టం లేదు. ఇతరులచేత గౌరవింపబడాలి అని మీరు అనుకొంటే అది మీ సాధనను పాడుచేస్తుంది. నీలోపలఉన్న సత్యానికి ఇతరులు లేరు. నీ అహంకారానికే ఇతరులు ఉన్నారు, ఇతరులచేత గౌరవింపబడాలి అనే తలంపు మీకు ఉంటే మీ తలంపే మీకు జ్ఞానం కలుగకుండా ఆపుచేస్తుంది.

భగవాన్ ఎక్కువగా విచారణమార్గం గురించి చెప్పారు భక్తి అక్కరలేదా అని అడుగుతూ ఉంటారు. భక్తి లేకపోతే మీకు విచారణమార్గం నడవదు. భక్తి ఉండి విచారణ చేస్తే వాలుగాలిలో సైకిలు త్రొక్కినట్లు ఉంటుంది. భగవదనుభవం పొందటానికి కావలసిన సామగ్రిలో భక్తి ఒకటి. అనేక జన్మలు మనం కృషి చేయటం వలన ఈశ్వరుడి మీద ప్రేమ, భక్తి కలుగుతుంది. భక్తి వలన శక్తి కలుగుతుంది.

మీరు జపం చేస్తూ అది ఇతరులకు తెలియాలి అని అనుకొంటే అది మార్కెట్‌భక్తి అవుతుంది. భగవదనుభం పొందటానికి అది సహకరించదు. నేను వారిని బాగుచేయాలి అనుకొంటున్నాను అని భగవాన్‌తో అంటే ముందు నీవు బాగుపడు తరువాత వారి గురించి చూద్దాము అనే వారు మీమాట, చేత, తలంపు ఎంత నిర్మలంగా ఉంటే అంత దేవుని తెలుసుకోవటానికి సహకరిస్తాయి. ఎవరి మాట, చేత, తలంపు నిర్మలంగా ఉన్నాయో వారు బాగుపడటమే కాకుండా వారిమాట, చేత, తలంపు ఇతరులను కూడా బాగుచేస్తాయి. నీకు శాంతి లేకుండా ఇతులకు శాంతి ఇవ్వటానికి ప్రయత్నం చేస్తాను అనటం నిన్ను నీవు వంచన చేసుకోవటమే. ముందు నువ్వు బాగుపడు. ఆధ్యాత్మికంగా అభివృద్ధిలోనికిరా. అప్పుడు నీ ద్వారా లోకానికి సహకారం అందుతుంది.

మనం గుడికి వెళతాము. ఒక స్థితి వచ్చేవరకూ వెళ్ళవలసిందే. కాని వస్తువు అనుభవంలోనికి వచ్చాక ప్రకృతితో సంబంధం తెగిపోతుంది. ప్రకృతిలో ఉంటావు, ఉన్నప్పటికీ ప్రకృతి నిన్ను బంధించదు. మీ హృదయంలో ఉన్న ఈశ్వరుడు అనుభవంలోనికి వచ్చాక బాహ్యంగా ఉన్న దేవతలతో కూడా నీకు పని ఉండదు. నీవు పొందవలసినది ఎక్కడో వైకుంఠములో ఉంది అనుకొంటున్నావు. చనిపోయిన తరువాత అక్కడకు ప్రయాణం చేద్దాము అనుకొంటున్నావు. చనిపోయిన తరువాత దానిని పొందుదాము అనుకొంటున్నావు పొందవలసినది నీహృదయంలోనే ఉంది. చనిపోయిన తరువాత పొందేది కాదు. ఈ దేహం చనిపోక ముందే ఆ వస్తువును పొందితే ఇంక పునర్జన్మరాదు. నీవు పొందవలసిన వస్తువు నీ హృదయంలోనే ఉంది అనే నిర్ధారణకు రావాలి. అది పొందటానికి నీ మనస్సు అణగాలి. మనస్సు అణగటానికే యోగం. మీరు అందరూ తెగిన గాలిపటాలలాగ లేరు. మీ దేహం యొక్క ప్రారబ్ధాన్ని బట్టి ఈశ్వరుడు మిమ్మల్ని నడిపిస్తూ ఉంటాడు. మీ దేహప్రారబ్ధం ప్రకారం ఏది రావాలో అది ఈశ్వరాజ్ఞనుబట్టి వస్తుంది. కేవలం నీకు అంగబలం, ధన బలం ఉన్నంత మాత్రం చేత ఏదీ రాదు. మీ దేహప్రారబ్ధం ప్రకారం వచ్చేది వస్తుంది, రానిది రాదు. అందువలన మీ దేహాన్ని ప్రారబ్ధానికి విడిచిపెట్టి మీ మనస్సును నియమించుకొనే పని చూసుకోండి. భగవంతుడు ఒకడు ఉన్నాడు అని పరిపూర్ణమైన విశ్వాసం కలిగితే ఆయనపట్ల మీ మనస్సు శరణాగతి పొందటం నేర్చుకొంటుంది. అలా శరణాగతి పొందగా పొందగా నీ మనస్సు అణుగుతుంది. శరణాగతి అంటే చెపుతున్నాను మనం రేపటి రోజు గురించి ఆలోచిస్తాము. భగవాన్ ఒక్కడే అరుణాచలం వచ్చాడు. ఆయన అరుణాచలం వచ్చేటప్పటికి ఆయన దగ్గర 3,4 రూపాయలు డబ్బు ఒక మిఠాయి పొట్లం ఉన్నాయి. ఆయన అరుణాచలేశ్వరుడి గుడిదగ్గర చెరువులో డబ్బు పారవేసాడు; మిఠాయి పారవేసాడు. మరిపొట్ట ఎలా వెళుతుంది అనుకొన్నాడు శరణాగతిలో ఉన్న కీలకం అర్థం చేసుకోండి. ఇది అసలు మనం ఊహించలేము. ఆయనకు నాఅనేవాడు ఎవడూ అక్కడలేడు. అరుణాచలేశ్వరుడిని నమ్మి జనకభావనతో వచ్చాడు. ఈశ్వరుడు ఏ టైములో ఏది సమకూర్చితే అది అనుకొన్నాడు. అది భక్తి అది శరణాగతి. రమణమహర్షి జ్ఞానం గురించే చెప్పారు, భక్తిలేదు అంటారు. ఆయనకు భక్తి లేదు అని ఇప్పుడు మనం ఎలా చెపుతాము.

నేను అందరి హృదయాలలో ఉన్నాను అని భగవంతుడు చెప్పాడు. కాని మనం తిరుపతిలో దేవుడు ఉన్నాడు, అరుణాచలంలో దేవుడు ఉన్నాడు అని అక్కడకు వెళుతున్నాము. హృదయంలోనికి వెళ్ళాలనే బుద్ధి మనకు కలగటం లేదు. దేహబుద్ధి బయట ఉన్న దేవుడి దగ్గరకు వెళ్ళటానికి ఇష్టపడుతుంది, హృదయంలోనికి వెళ్ళటానికి ఇష్టపడదు. మనకు దేహబుద్ధి ఎంత బలంగా ఉంది అంటే నేను మీహృదయంలో ఉన్నాను అని భగవంతుడు ఎన్నిసార్లు చెప్పినా బయట ఉన్న దేవతల మీదకు నీ మనస్సు వెళుతుందిగాని హృదయం వైపుకు వెళ్ళదు. ఈ దేహబుద్ధిని వైరాగ్యం అనే గొడ్డలితో నరికిన వాడికి హృదయంలో ఉన్న వస్తువు తెలుస్తుంది. మీకు సంతోషం వచ్చినా దు:ఖం వచ్చినా అన్నీ తలంపులే. వాటికి మూలతలంపు నేను. అది వచ్చిన తరువాత ఇతర తలంపులు అన్నీ వస్తున్నాయి గాని అదిలేకపోతే ఇతర తలంపులు లేవు. చనిపోవటం కూడా నిజం కాదు అది కూడా తలంపే. దేహం చనిపోయే రోజున మనస్సు ఎలా ఉందో తరువాత కూడా అలాగే ఉంటుంది. తేడా ఏమిటి అంటే ఇప్పుడు దేహం, లోకం కనిపిస్తున్నాయి. చనిపోవటం అంటే నీ మనస్సు అలాగే ఉంటుంది. దేహం, లోకం కనబడవు, తరువాత నీ మనస్సులో ఉన్న సంస్కారములను బట్టి మరల కొత్త దేహం వస్తుంది. దేహం వస్తే లోకం వస్తుంది. అప్పుడు దేవతలందరూ వచ్చేస్తారు పూజలు ప్రారంభం. నిద్రలో నీకు ఏ గొడవలేదు. నేను అనే తలంపు వచ్చాక ఇవి అన్నీ వస్తున్నాయి. ఆనేను ఎవరు అని తెలుసుకోవటానికి నీవు చేసే ప్రయత్నమే తపస్సు. తపస్సు అంటే ఎక్కడో ఒక చోట కూర్చొని నామం చేసుకోవటం తపస్సు కాదు. మిమ్మల్ని ఎవరైనా విమర్శిస్తే మీ మనస్సుకు గాయం తగలకుండా మనస్సును నిదానంగా ఉంచుకోవటం తపస్సులో భాగమే. కొంత మంది మేము సాధన చేస్తున్నాము అంటారు. ఎవరైనా చిన్న మాటఅంటే భరించలేరు. అంటే వారు చేసేది తపస్సుకాదు.

హృదయంలో ఉన్న వస్తువు మన కళ్ళకు కనిపించటం లేదు కాని ఉంది. నీకు కనిపించనంత మాత్రం చేత, నీకు అర్థంకానంతమాత్రంచేత ఉన్న సత్యం లేదని కాదు. ఇక్కడ ఉంది, అక్కడలేదు అనికాకుండా అన్ని చోట్ల సమానంగా ఉంది, మన హృదయంలోనూ ఉంది. యదార్థం చెప్పాలి అంటే మనలో అది ఉండటం కాదు, దానిలో మనం ఉన్నాము. ఆవస్తువు అనుభవంలోనికి వచ్చాక ఇది మనకు తెలుస్తుంది. విషయం మీకు బాగా అవగాహన అవ్వాలి. మీకు బాగా అవగాహన అయితే మీరు చేసే ప్రయత్నానికి మీ అవగాహన సహకరిస్తుంది. మీ తెలివి, మీఅహంకార రహితజీవితము వస్తువును పొందటానికి మీకు సహకరిస్తాయి. మౌనం కూడా భాషే. ఆత్మ యొక్క నిజమైన భాష మౌనం. జ్ఞానియొక్క అనుగ్రహం భక్తుల హృదయంలో మౌనంగా ప్రవేశిస్తుంది. ఈసృష్టినంతా నడిపిస్తూ ఎప్పుడూ ఎక్కడ ఏది ఎలా జరగాలో అంత నడిపిస్తూకూడా భగవంతుడు మౌనంగా పనిచేసుకొంటూ పోతున్నాడు. మనం గుర్తించాలి అని ఆయన అనుకోవటం లేదు పనిఅంతా జరిగిపోతుంది. మనం చిన్న సత్రం కట్టిస్తే అంతా గోలగోల చేసేస్తాము. ఇవిఅన్నీ జీవలక్షణాలు. జీవలక్షణాలు ఉన్నంతసేపు నీవు జపాలు చేసిన, ధ్యానాలు చేసినా నీకు సత్యసాక్షాత్కారము కలుగదు. వందరూపాయలు పెట్టిదండకొని దేవునికి వేసి రమ్మంటే వేస్తారు గాని హృదయంలో ఉన్న వస్తు

గురించి తెలుసుకోవటానికి కొంచెంకూడా ప్రయత్నం చేయరు ఇదే మాయ. అలాగని దేవుడికి దండవేయవద్దు అనికాదు. ఆప్రయత్నం ఎంతసేపు అయినా చేస్తారుగాని హృదయంలో ఉన్న వస్తువు గురించి కనీసం ఆలోచించరు అంటే దేహభావన అంత గట్టిగా నాటుకొని ఉంది.

మనస్సును పవిత్రం చేసుకోవటానికి ప్రయత్నం చేయకుండా కేవలము గౌరవాలకోసం, గొప్పలకోసం పనిచేస్తూ ఉంటే వారిని డంబాచారి అన్నాడు కృష్ణుడు. ఈశ్వరార్పణ బుద్ధితో కాకుండా కేవలం గొప్పల కోసం వస్తువును ఇతరులకు ఇస్తే దాని వలన తాత్కాలికంగా లోకంలో నీకు గౌరవం రావచ్చును, జ్ఞానం సున్నా. నీవు ఏదైనా పనిచేస్తే దానివలన నీమనస్సు బాగుపడాలి, ఇతరులు బాగుపడటానికి అది సహకరించాలి. లోకంలో మంచి పనులు చెయ్యి. మంచి పనులు చేయటంద్వారా నీవు బాగుపడటం చూసుకో. నీవు చేసిన మంచి పనుల వలన లోకం అంతా ఉద్ధరించబడాలి అనేపిచ్చి ఆలోచనలలోనికి వెళ్ళకు. నీవు చేసేపని హృదయపూర్వకంగా చెయ్యి. దానివలన లోకం బాగుపడవచ్చు, బాగుపడకపోవచ్చు. అది బాగుపడకపోయినా నీవు మంచి ఉద్దేశంతో చేస్తే నీవు పవిత్రుడవుతావు, నీకు మోక్షం వస్తుంది. ఎవరికైనా సహృదయంతో మంచిమాట చెపుతాము అనుకోండి. అదివాడు వినకపోయినా నీవు పవిత్రుడవుతావు. ఎందుచేతనంటే నీవు సహృదయంతో చెప్పావు కాబట్టి నీ తలంపు, నీమాట నిన్ను పవిత్రున్ని చేస్తుంది. మనం తపస్సు మనస్సు తోటి, దేహంతోటి, మాటతోటి చేస్తాము. ఈ మూడింటిని సద్వినియోగం చేసుకోవాలి. నీ దేహం ఎక్కడ ఉన్నా ఈశ్వరునితో మానసిక అనుబంధం ముఖ్యం. మీ మనస్సు హృదయాభిముఖంగా ప్రయాణం చేస్తూ ఉంటే , దాని మూలంలో కూరుకొనిపోతూ ఉంటే మీకు తెలియకుండా వాటి అంతట అవే బాహ్య ఆకర్షణలు తగ్గిపోతాయి. ఇద్దరు గురువులు బ్రహ్మానుభవం పొందితే వారి శరీరాలు తేడాగా కనిపిస్తాయి గాని వారు పొందిన స్థితి ఒక్కటే. ఎందుచేతనంటే ఉన్న వస్తువు ఒక్కటే. మీరూ జ్ఞానే, వారూ జ్ఞానే మీరు వారిని ఎప్పడైనా చూసారా అని ఒక భక్తుడు భగవాన్‌ను అడిగారు. జ్ఞానులు ఇద్దరు ఉన్నారా అన్నారు భగవాన్. ఉపాధుల తేడా గాని జ్ఞానం ఒక్కటే. మన శరీరాల రంగులవేరు, గుణాలువేరుగాని ఇప్పడు కూడా హృదయంలో మనం అందరమూ ఒక్కటిగానే ఉన్నాము. ఇప్పడు మీ మనస్సుకు లోకంతో అనుబంధం ఉందా, దేవునితో అనుబంధం ఉందా అని ఇంటి దగ్గర ప్రశాంతముగా కూర్చొని చూసుకోండి. మనకు లోకంతోనే అనుబంధం ఉంది ఇంకా ఈశ్వరుడితో అనుబంధం రాలేదు అని మీకు తెలుస్తుంది.

